www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 6 నవంబర్ 2025



తిరుమలలో వైభవంగా కార్తీక పౌర్ణమి గరుడసేవ

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో బుధవారం రాత్రి కార్తీకపౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనసేవలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పింఛన్ టెన్షన్

- అర్హుల కుదింపులు, కోతలు
- వికలాంగులకు నోటీసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రకరకాల కారణాలతో వికలాంగుల పింఛన్లలో ప్రభుత్వం కోతలు పెడుతోంది. ఈ కోతలకు ప్రభుత్వం రీవెరిఫికేషన్, సదరం క్యాంపుల పేరిట అనర్హులుగా తెల్చింది. 'మహోప్రభో మేము దివ్యాంగ పింఛన్లకు అర్హులమంటూ' నెత్తినోరు కొట్టుకుంటే జిల్లా కలెక్టర్ మరోమారు అర్హత నిరూపించుకోవాలంటూ సదరం రీవెరిఫికేషన్‌కు అవకాశం కల్పించారు. రీ వెరిఫికేషన్‌లోనూ గతంలో నెలకు రూ.12వేలు తీసుకుంటున్న దివ్యాంగుల్లో అనేక మందిని సాధారణ పింఛన్‌కు కుదించారు. అనేక మందిని అసలు పింఛన్‌కు అనర్హులుగా తెల్చారు. గత నెలలో అర్హత నిరూపించుకోలంటూ నోటిఫికేషన్ జారీ చేసిన దివ్యాంగులకు అక్టోబర్ నెల పింఛన్ ఇచ్చారు. అయితే నవంబర్ నెల పింఛన్ ఇస్తారా లేదా అనే అనుమానంతో దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ల వెరిఫికేషన్‌లో జిల్లాలో 1,182 దివ్యాంగులను పింఛన్‌కు అన్హులుగా గుర్తించారు. రీ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించగా రీవెరిఫికేషన్‌లో వికలాంగత్వం తక్కువ ఉందంటూ 684 మంది దివ్యాంగులను సాధారణ పింఛన్ నెలకు రూ.4వేలకు పరిమితం చేశారు. 498 మంది దివ్యాంగుల పింఛన్లు రద్దు చేశారు. వీరందరికి అక్టోబర్ నెల పింఛన్ గతంలో ఎలా ఇచ్చారు.. అలానే ఇచ్చారు.. అయితే అర్హత నిరూపించుకోవాలంటూ నోటీసులు జారీ చేయడంతో నవంబర్ నెల కోత విధించే అవకాశమున్నట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



పింఛన్లు తొలగిస్తున్నట్లు పంపిన నోటీసులను చూపుతున్న వికలాంగులు

మండలాల వారీగా పింఛన్ల తొలగింపులు, కుదింపుల వివరాలు

మండలం	తొలగింపు	కుదింపు	మొత్తం
బైరెడ్డిపల్లి	08	14	22
బంగారుపాళ్యం	11	36	47
చిత్తూరు	13	11	24
చిత్తూరు మున్సిపాలిటీ	45	75	120
చౌడేపల్లి	02	20	22
జీడీ నెల్లూరు	06	03	09
గంగవరం	18	23	41
గుడిపాల	27	12	92
గుడిపల్లి	80	15	42
ఐరాల	07	34	41
కార్వేటినగరం	02	05	09
కుప్పం	20	05	07
కుప్పం (రూ)	01	04	05
నగరి	06	10	24
నగరి మున్సిపాలిటీ	02	05	19
నింద్ర	01	04	17
పాలసముద్రం	04	13	35
పెద్దపంజాణి	12	23	34
పలమనేరు	12	33	43
పెనుమూరు	17	17	34
పులిచర్ల	03	05	08
పుంగనూరు	02	16	18
పూతలపట్టు	13	12	28
రామకుప్పం	05	50	55
రొంపిచర్ల	0	01	01
శాంతిపురం	03	06	09
సదుం	04	32	36
ఎస్ఆర్‌పురం	21	39	60
తవణంపల్లి	29	48	77
వెదురుకుప్పం	01	02	03
వీకోట	06	12	18
విజయపురం	06	12	21
మొత్తం	**498**	**684**	**1,182**

ప్రత్యేక ఆకర్షణగా ఏనుగుల హబ్

- పర్యాటక కేంద్రంగా ముసలిమడుగు

ప్రజాశక్తి- పలమనేరు

వన్యప్రాణులకు కేంద్రం.. చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతం. ఈ ప్రాంతం తిరుపతికి సమీపంలో ప్రారంభమయ్యే శేషాచలం అటవీప్రాంతం నుంచి పీలేరు వరకు విస్తరించి ఉంది. అక్కడి నుంచి మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పలమనేరు నుంచి వి.కోట మీదుగా కుప్పం వరకు కౌండిన్య అటవీ ప్రాంతం విస్తరించి ఉంటుంది. పలమనేరు, కుప్పం నియోజకవర్గాలతోపాటు అటు తమిళనాడు, కర్ణాటక అటవీ ప్రాంతం అనుసంధానంగా ఉంటుంది. తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి దండెత్తే ఏనుగుల వల్ల కుప్పం, పలమనే నియోజకవర్గాల్లోని అటవీ సమీప గ్రామాలు సమతమం అవుతున్నాయి. వేలాది ఎకరాల్లో పంట, చాలా మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. వారికి అటవీశాఖ నష్టపరిహారం చెల్లిస్తూనే ఉంది.

డిప్యూటీ సీఎంగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు తీసుకున్న అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లాపై దృష్టి సారించారు. కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి 2025 మే 21వ తేదీ నాలుగు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వం నుంచి రప్పించారు. వాటిని పలమనేరు సమీపంలోని ముసలిమడుగు వద్ద ఏర్పాటు చేసిన క్యాంపులో ఉంచారు.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి..

కౌండిన్య అటవీ ప్రాంతంలో తిష్టవేసి, తరచూ పంటలపై దాడులకు దిగే 14 ఏనుగుల మందను తిరిగి వనంలోకి మరల్చడానికి ముసలిమడుగు వద్ద ఏర్పాటు చేసిన ఏనుగుల క్యాంపు ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ క్యాంపు 50 ఎకరాల్లో ఉంది. ప్రస్తుతం 20 ఎకరాలు ఏనుగులకు శిక్షణ, తిరగడం, విన్యాసాలు చేయడం కోసం వినియోగిస్తున్నారు. చుట్టూ ఫెన్సింగ్‌తో పాటు మావటీల కోసం నివాస గృహాలు కూడా నిర్మిస్తున్నారు. ఏనుగుల ఆరోగ్య సంరక్షణ కోసం వెటర్నరీ ఆస్పత్రి కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. దీంతో రాష్ట్రానికి ముసలిమడుగు ఏనుగుల హబ్ ప్రత్యేక ఆకర్షణగా మారింది.

30 ఏళ్లుగా సేవలందిస్తున్న కుంకీలు..

కుప్పం సమీపంలోని రామకుప్పం మండలం అటవీ సమీప ప్రాంతంలోని ననియాల వద్ద 2006లో ఏనుగుల సంరక్షణ కేంద్రానికి జయంత్, వినాయక్ అనే



ముసలిమడుగు వద్ద ఉన్న కుంకీ ఏనుగుల క్యాంప్

రెండు కుంకీ ఏనుగులను రంగంలోకి దించారు. కుంకీ ఏనుగులు దాదాపు 30 ఏళ్లుగా సేవలు అందిస్తున్నాయి. పడమటి ప్రాంతంలో కౌండిన్య అటవీ ప్రాంతం నుంచి గ్రామాలపైకి వస్తున్న మదపుటేనుగుల దాడులు పెరిగాయి. వాటిని మళ్లీ అడవుల్లోకి పంపిచే దిశాగా ననియాల కుంకీ ఏనుగులతో ఆపరేషన్ చేపట్టడం కష్టంగా మారింది. పలమనేరు ప్రాంతంలోని అటవీ సరిహద్దు గ్రామాల్లో ఏనుగుల దాడులు మరింత పెరిగాయి. వరి, అరటి, రాగి చేలతో పాటు మామిడి తోటలను కూడా ఏనుగులు ధ్వంసం చేశాయి. కౌండిన్య అటవీప్రాంతానికి సమీపంలోనే ఉండే ఈ ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఏనుగుల దాడుల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. చాలా మంది ప్రాణాలు కూడా కోల్పోయారు. ఈ నష్ట నివారణకు అడవుల నుంచి వచ్చే ఏనుగుల మందను దారి మళ్లించడానికి పలమనేరుకు మూడు కిలోమీటర్ల దూరంలో కుంకీ ఏనుగులకు ముసలిమడుగు వార్‌జోన్‌గా నిర్ణయించారు. దీనికోసం కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వడానికి మావటీలకు మచ్చిక చేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ ప్రదేశాన్ని పర్యాటకులకు



ముసలిమడుగును పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఆహ్లాదంగా మార్చాలని చిత్తూరు కలెక్టర్ ఆదేశించారు.

అటవీశాఖ అధికారిక లెక్కల ప్రకారమే..

2025 సెప్టెంబర్ నాటికి ఏనుగుల దాడుల్లో 30మందికి పైగానే మరణించారు అంతేకాకుండా, 2020-21, 2023- 24 కాలంలోనే ఒకో సంవత్సరంలో ఆరుగురు మరణించినట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ సంఘటనల నేపథ్యంలో అటవీశాఖ యంత్రాంగం కూడా స్పందించింది. ఏనుగుల దాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు చెల్లిస్తున్న పరిహారం రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచి చెల్లిస్తున్నారు.

ఏనుగుల హబ్‌గా ముసలిమడుగు

ముసలిముడుగు ఏనుగుల క్యాంపును ఈనెల 4వ తేదీ బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సందర్శించారు. ఏనుగులకు శిక్షణ శిక్షణ ఇస్తున్న తీరుతో పాటు అవి చేస్తున్న విన్యాసాలను ఆయన పరిశీలించారు. ఈ ప్రదేశాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఈ ఏనుగుల ప్రత్యేకతను డీఎఫ్ఓ సుబ్బరాజు, పలమనేరు డివిజన్ అడిషనల్ డీఎఫ్ఓ నారాయణ వివరించారు. కుంకీ ఏనుగులు ఉన్న పరిసర ప్రాంతాల్లోకి మదపటేనుగులు రాలేవని, అవి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండగానే కుంకీ ఏనుగులు పసిగడతాయని, ప్రమాదాన్ని గ్రహించే కుంకీ ఏనుగులు ఒక్క ఘీంకారంతో మావటీలను అప్రమత్తం చేస్తాయని వివరించారు. ఏనుగుల సైకాలజీ ఎప్పుడు ఎలా ఉంటుందనే విషయాలని కలెక్టర్ ఆసక్తికరంగా ఆలకించారు.

ముసలిమడుగు ఏనుగుల క్యాంపు వద్ద మరింత భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ అటవీశాఖాధికారులకు సూచించారు. ఇప్పుడు కార్తీకమాసం ప్రారంభమైందని, ఇక్కడే వనభోజనాలు ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని అలాగే సందర్శకులను ఆకర్షించడంతో పాటు వారి వల్ల ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగా మారడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏనుగుల క్యాంప్ వద్ద సందర్శకులకు కూడా ప్రమాదం లేని విధంగా భద్రతా చర్యలతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పలమనేరు సమీప ప్రాంతాల నుంచి కూడా సందర్శకుల సంఖ్య ఎక్కువగానే ఉందని, ఉదయం పది గంటల నుంచి సాయంత్రం వరకు ఏనుగుల క్యాంపు సమీప ప్రాంతానికి సందర్శకులను అనుమతిస్తున్నామని ఫారెస్టు రేంజ్ అధికారి నారాయణ చెప్పారు.

వినాయకుని సేవలో యార్లగడ్డ



ప్రజాశక్తి- ఐరాల: శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరితోపాటు చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ కూడా స్వామివాని దర్శించుకున్నారు. వీరిని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ దేవస్థానం అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన ఈవో పెంచల కిషోర్ వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ మణి నాయుడు, ఏఈఓలు రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఆదర్శం పుంగనూరు అభివృద్ధి

మాజీ ఎంపీ ఎన్.రెడ్డప్ప

ప్రజాశక్తి- పుంగనూరు: స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కే.పట్టాభిరామ్ పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధిని చూసినా కళ్లున్న గుడ్డివాడిలా మాట్లాడుతున్నాడని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పుంగునూరు పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించారు. పట్టాభిరామ్ మాటలు వింటుంటే అవగాహన లేకుండా మాట్లాడడానికి ఇది ఒక నిదర్శనమని అన్నారు. అధికార పార్టీ ప్రోటోకాల్ మరిచి ప్రవర్తిస్తున్నారని కనీసం మీడియా కూడా ప్రశ్నించ లేకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తి అయిందని, మీరు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. పుంగనూరు అభివృద్ధి చూడాలంటే పట్టాభిరామ్‌కు చూపిస్తామని చూసి మాతో చర్చకు వస్తారా అంటూ సవాల్ విసిరారు. పుంగనూరు నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు సిమెంట్ రోడ్లు, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, మురుగునీటి కాలువలు వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. మండలం నుంచి అన్ని గ్రామాలకు కలుపుతూ తారు రోడ్లు నిర్మించారని చెప్పారు. ఇవన్నీ ఏమీ చూడకుండా నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ బాష మాట్లాడుతూ పుంగునూరు మున్సిపాలిటీకి 2017లో ఏపీ గ్రీన్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ అవార్డు, 2022- 23 స్వచ్ఛ సర్వేక్షన్ రాష్ట్రస్థాయి అవార్డులు, 2024లో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు వచ్చిందని ఇవేమీ పట్టాభిరామ్‌కి కనపడడం లేదన్నారు. పుంగనూరు మున్సిపాలిటీలో అన్ని రకాల అభివృద్ధి చేయడంతో పాటు 1000 విద్యుత్ పోల్స్ మార్చామన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డిపై బురదజల్లే కార్యక్రమం మానుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ ఎండి.రహమతుల్లా, రాయలసీమ జిల్లాల జోనల్ కార్యదర్శి ఫక్రుద్దీన్ షరీఫ్, మాజీ వైస్ ఛైర్మన్ ఆవుల అమరేంద్ర, కౌన్సిలర్స్ రేష్మ, కొండవీటి నటరాజ, కాళిదాస్, వైసిపి మండల పట్టణ అధ్యక్షులు, అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డప్ప

ఘనంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) 19 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం స్థానిక ఎమ్మెస్సార్ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని జిల్లా యూనియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ జెండాను ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సాటి గంగాధరం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్ మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనకు ఏపీడబ్ల్యూజేఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తోందని తెలిపారు. 'సేవ్ జర్నలిజం - ప్రొటెక్ట్ జర్నలిస్ట్' అనే నినాదంతో జర్నలిస్టుల పక్షాన పత్రికా స్వేచ్ఛ కోసం సంఘం అలుపెరగని కృషి చేస్తోందన్నారు. ఆల్ ఇండియా జర్నలిస్ట్ అలియన్స్‌కు అనుబంధంగా దేశస్థాయిలో ఎపిడబ్ల్యూజేఎఫ్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. చిత్తూరు జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఫెడరేషన్ సభ్యులందరికీ చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆర్థిక సహకారంతో జర్నలిస్ట్ హెల్త్ కార్డులను జారీ చేయడం జరిగిందన్నారు. జర్నలిస్టుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించే ఏకైక సంఘం ఏపీడబ్ల్యూజేఎఫ్ అని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షులు బి.ప్రకాష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో యూనియన్ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం జారీ చేసే అక్రిడిటేషన్లు, 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు నియోజకవర్గ ప్రధానకార్యదర్శి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న భద్రతా చట్టాలను ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నిరాశ్రయుల వసతి గృహంలోని నిరాశ్రయులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఎలక్ట్రానిక్ మీడియా, జిల్లా అధ్యక్షులు వి. జయచంద్ర, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి పట్నం కృపానందరెడ్డి, ప్రచార కార్యదర్శి ఎస్‌జె.దినేష్ కుమార్, సంయుక్త కార్యదర్శులు యాదవేంద్రరెడ్డి, గందోడి హరిప్రసాద్, చిత్తూరు నియోజకవర్గ కోశాధికారి ఎం.నాగరాజు, ఉపాధ్యక్షులు వి. మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శులు విజయకుమార్, ఉదయ్, సురేంద్రరెడ్డి, కుబేంద్రన్, యూనియన్ సభ్యులు ఎన్.మురళి, మంజునాథ్, చిట్టిబాబు పాల్గొన్నారు.

పుంగనూరు: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ 19వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పుంగనూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గోకుల్ సర్కిల్లో బుధవారం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ సుబ్బరాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని జర్నలిస్ట్ సంఘ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకోవడం, కార్యక్రమానికి మమ్మల్ని పిలవడం చాలా సంతోషించేదగ్గ విషయమన్నారు. జర్నలిస్టులు సమాజసేవకు ఎప్పుడు ఉపయోగపడే విధంగానే నడుచుకోవాలని సూచించారు. సమాజానికి ఆదర్శవంతులుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రమణ, ఫెడరేషన్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సైపుల్ల, అప్ప, భాను, కార్తీక్ పాల్గొన్నారు.



దేశానికి ఆదర్శంగా 'కుప్పం'

మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి ప్రజలు సహకరించాలి: ఎమ్మెల్సీ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి-కుప్పం: స్వచ్ఛత, అభివృద్ధి విషయంలో కుప్పం మున్సిపాలిటీని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం పట్టణంలో రాజు కాలువ ఏర్పాటు, వాకింగ్ ట్రాక్, చిరు వ్యాపారులకు అనుకూలంగా డ్రైనేజీ కాలువ నిర్మాణానికి సంబంధించి బుధవారం టిడిపి నేతలతో కలిసి ఎమ్మెల్సీ శ్రీకాంత్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కుప్పం మున్సిపాలిటీలో చిట్టచివరి గ్రామాల్లో డ్రైనేజీల ఏర్పాటు కోసం సీఎం చంద్రబాబు రూ.95 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. కుప్పం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి అమరావతి రాజధాని ప్రణాళికలు సిద్ధం చేసిన సుర్బాన కంపెనీ ద్వారా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కుప్పంలో డంపింగ్ యార్డులు కనబడకుండా ఏ రోజు చెత్తను ఆ రోజే సంపద కింద మలిచే విధంగా పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కుప్పం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కడ కృషి ప్రశంసనీయమని ఈ సందర్భంగా కడపిడి వికాస్ మర్మత్‌ను ఎమ్మెల్సీ అభినందించారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేటప్పుడు ఒకరిద్దరికి ఇబ్బంది కలిగిన ప్రజల కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రెండు మూడు ఏళ్లలో కుప్పం మున్సిపాలిటీ రూపురేఖలు మారనుందని, అభివృద్ధికి రోల్‌మోడల్‌గా నిలవబోతోందని తెలిపారు. పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, టిటిడి బోర్డు సభ్యుడు శాంతారాం, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, కడ పీఏసీ సభ్యులు రాజ్ కుమార్, సుగుణమ్మ, సతీష్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్లు జిమ్ దాము, జాకీర్, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా..

- జెసిబిలతో పొలాలను తవ్వేస్తున్న వైనం
- నిద్రావస్థలో అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం)

కౌండిన్య నదికి ఇరువైపుల పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు ఎక్కువ కురవడంతో వరద కారణంగా నది నీటితో కళకళలాడుతోంది. దీంతో ఇసుకను అక్రమంగా పక్కరాష్ట్రాలకు తరలిస్తూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న ఇసుకాసురులు నదికి ఇరువైపులా రాత్రి వేళల్లో జెసిబిలు, ట్రాక్టర్ల సాయంతో ఇసుకను తోడేస్తున్నారు. దీనికి తోడు పక్కనే ఉన్న పంట పొలాల్లో ఇసుక, మట్టిని నిల్వ ఉంచి తమకు నచ్చిన రేట్‌కు అమ్ముకుంటున్నారు. దీంతో పాటు నదికి ఇరువైపులా ఉన్న పంట పొలాల్లోనూ రాత్రివేళల్లో మట్టి తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం నది, వాగులు, వంకల్లో ఇసుక తరలించాలన్న అధికారుల వద్ద అనుమతి తప్పనిసరి. అయితే ఇసుకాసురులకు ఎలాంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా తరలిస్తూ ఉండడంతో నదికి ఇరువైపులా ఉన్న రైతులు తమ భూములకు రక్షణ కరవైందని, ఇలాగే కొన్ని రోజులు కొనసాగితే తమ భూములు పూర్తిగా కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చెరువులలోనూ మట్టిని సుమారు 50అడుగుల వరకు లోడి రియల్ ఎస్టేట్ వ్యాపారులు పునాదు వేసుకునేందుకు అనుమతులు లేకుండానే ట్రాక్టర్లతో తోలేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రసుత్తం వర్షాలకు భూగర్భ జలాలు ఉన్నా రాబోయే రోజులలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని పలువురు అంటున్నారు. ఓ చోట అయితే కౌండిన్య నదికి చెక్‌డ్యాంను పూర్తి తొలగించి పగటిపూట జెసిబితో నీటిలో ఉన్న మట్టి ఇసుక తీసి అమ్ముకున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.



నదికి ఇరువైపులా జెసిబితో ఇసుకను తవ్వేస్తున్న దృశ్యం

పంటలపై జంట ఏనుగుల దాడులు

ప్రజాశక్తి- రామకుప్పం



మండలంలోని అటవీ సరిహద్దు ప్రాంతమైన పులిమడుగు తండాలో జంట ఏనుగులు మంగళవారం రాత్రి పంటలపై దాడులు చేశాయి. అర్ధరాత్రి గ్రామంలోని చంద్రశేఖర్ నాయక్, కృష్ణా నాయక్‌కు చెందిన వరి పంటలపై పడి తిన్నంత తిని, తొక్కి ధ్వంసం చేసి వెళ్లాయి. దీంతో సుమారు రూ.75వేలు మేర పంటనష్టం వాటిలిందని రైతులు వాపోయారు. కోత దశకు వచ్చిన వరి పంటలను ఏనుగులు నాశనం చేస్తుండటంపై బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు తిని రుచి మరిగితే మళ్ళీమళ్ళీ ఏనుగులు గ్రామాల వైపు వస్తాయని రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి తమకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరారు.



చెత్త సేకరణ ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చెత్త సేకరణకు ఈ- ఆటోలు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. బుధవారం గుడిపాల మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఎం ఎజేవై (ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన) ద్వారా గ్రామ పంచాయతీల్లో చెత్తసేకరణ కోసం మంజూరైన ఐదు ఎలక్ట్రిక్ ఆటోలను ఎమ్మెల్యే స్వయంగా నడిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఈ ఆటోలను సద్వినియోగం చేసుకొని గ్రామాలను శుభ్రంగా ఉంచడంతో పాటు, వ్యర్థాలను సరైన రీతిలో ప్రాసెస్సింగ్ చేసి ఆదాయాన్ని పొందాలన్నారు. మండలంలోని వెంగమాంబ పురం, వసంతాపురం, మరకాలకుప్పం, బొమ్మసముద్రం, శ్రీరంగంపల్లి గ్రామపంచాయతీలకు ఈ-ఆటోలను పంపిణీ చేశారు. ఎంపీడీవో శిరీష, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, టిడిపి మండలాధ్యక్షుడు సుబ్బానాయుడు, సింగల్ విండో ఛైర్మన్ ప్రతాప్‌నాయుడు, ఉపాధ్యక్షులు ధనసింగ్, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం, రాష్ట్ర అధికార ప్రతినిధి జి.హేమాద్రి నాయుడు పాల్గొన్నారు.

అర్ధగిరిలో కుటుంబ సమేతంగా ఎస్పీ

ప్రజాశక్తి- తవణంపల్లి



కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి కుటుంబ సమేతంగా అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామిని బుధవారం సందర్శించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎస్పీ కుటుంబానికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి మునిశేఖర్, ఎస్ఐ చిరంజీవి ఘనస్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. వేలాది మంది భక్తులు ఉదయం నుంచే స్వామివారి దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు సౌకర్యాల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా: తహశీల్దారు



ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లిలో లక్షల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని తహశీల్దారు ఇన్బనాధన్ తెలిపారు. సర్వే నెంబర్ 199 లో 21 సెంట్ల ప్రభుత్వ భూమి రోడ్డు ఆనుకుని ఉండడంతో కబ్జాదారుల కళ్లు ఆ విలువైన భూమిపై పడ్డాయన్నారు. ముగ్గురు వ్యక్తులు ఒకరిపై ఒకరు పోటీ పడి మరీ ప్రభుత్వ భూమిని కాజేసినట్లు తెలుస్తోంది. పంచాయతీ కి చెందిన ఓ వ్యక్తి సంబంధిత స్థలం గురించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా తహశీల్దారు స్పందించి, స్థలాన్ని పరిశీలించి నాలుగు సెంట్ల విలువైన భూమి కాజేశారని లిఖితపూర్వకంగా గ్రామస్తుల సమాచారం ఇచ్చారు. తహశీల్దార్ స్పందించి మిగిలిన 17 సెంట్ల భూమిని ఆక్రమించడానికి సిద్ధంగా ఉన్న ట్లు తెలుస్తోంది. ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మిస్తే వాటిని కూల్చ లేమని అధికారులే ప్రకటించడంతో కబ్జాదారులు ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. అయితే ప్రభుత్వ స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుని అక్రమ కట్టడాలు కూల్చకపోతే మరింత బలం చేకూరి తొందరి స్వాధీనంగా విమర్శలు వస్తున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే కబ్జాదారులు ప్రభుత్వ స్థలాలను వెలికి మరీ నిర్మాణాలు చేపట్టే ప్రమాదం ఉందని గ్రామస్తులు భావిస్తున్నారు.

సీసీ కెమెరాలు అమర్చుకోవాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ దుకాణదారులు ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు అమర్చుకోవాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో దుకాణ దారులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మధ్య చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, జాగ్రత్తలు పాటించాలని కోరారు. షాపుల ముందు, లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, షాపుల్లో ఎక్కువ మొత్తం నగదు ఉంచకూడదని హెచ్చరించారు. జాగ్రత్తలు పాటిస్తే దొంగలను పట్టుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐ భాస్కర్, ఎస్ఐ మహేష్ బాబు, ఏఎస్ఐ గోవిందరాజులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


దుకాణదారులతో సమావేశమైన డిఎస్‌పి

పలమనేరు బాలాజీకి ఈస్తటిక్స్ సాహితీ పురస్కారం

- 'లోపలేదో కదులుతున్నట్టు' కవితా సంపుటి ఎంపిక
- 9వ తేదీ ఖమ్మంలో పురస్కార ప్రదానం
- సాహిత్య సంస్థలు, రచయితల సంఘాలు హర్షం

ప్రజాశక్తి-పలమనేరు: ప్రముఖ కవి, రచయిత, పెద్ద పంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీ ఈస్తటిక్స్ సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 9వ తేదీ ఖమ్మంలో వారు ఈ పురస్కారం అందు కోనున్నారు. పలమనేరు బాలాజీ ప్రచురించిన 'లోపలేదో కదులు తున్నట్టు' కవితా సంపుటికి 2025 ఈస్తటిక్స్ జాతీయ సాహిత్య పురస్కారం లభించింది. సాహిత్య రంగంలో ప్రతిష్టాత్మకమైన ఈస్తటిక్స్ జాతీయ సాహిత్య పురస్కారాన్ని స్థానిక కవి రచయిత పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీ కవితా సంపుటి లోపలేదో కదులుతున్నట్టు కు దక్కింది. ఈ పురస్కారం కింద 40 వేల రూపాయల నగదు సహా ఈస్తటిక్స్ జాతీయ సాహిత్య పురస్కారాన్ని ఈ నెల 9వ తేదీ ఆదివారం ఖమ్మంలో నిర్వహించనున్న సాహిత్య కార్యక్రమంలో పలమనేరు బాలాజీ అందు కోనున్నారు. జాతీయ స్థాయిలో 90 కవితా సంపుటాలు పోటీకి రాగా పరిశీలన అనంతరం 40 వేల రూపాయల నగదు ప్రధాన అవార్డును పలమనేరు బాలాజీకి ప్రకటిస్తున్నట్లు నిర్వాహకులు రవి మారుత్ (ఖమ్మం) తెలిపారని రచయిత పేర్కొన్నా రు. కవి, కథకుడు, నవలాకారుడు, విమర్శకుడిగా మూడున్నర దశాబ్దా లకు పైగా తెలుగు సాహిత్య రంగంలో కృషి చేస్తున్న పలమనేరు బాలాజీ తన రచనలకు ఇప్పటికే రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా రాష్ట్ర తెలుగు



భాషా పురస్కారాన్ని పొందారు. కందుకూరి వీరేశలింగం పంతులు పురస్కారం, సైరల్ పురస్కారం, సూతంపాటి గంగాధరం పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం పుర స్కారం, మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారం, గీతాంజలి స్మారక పురస్కారం, కెనడా తెలుగుతల్లి పురస్కారం, సడ్లపల్లి కథ పురస్కారాన్ని వారు ఇప్పటివరకు అందు కున్నారు.

ఆంగ్లం సహా అన్ని భారతీయ భాషల్లోకి వీరి కవిత్వం అనువాదం అయింది. కథలు కన్నడంలోకి, కవిత్వం ఆంగ్లంలోకి, కన్నడంలోకి అనువదించి ప్రచురితమయ్యాయి.

పలమనేరు బాలాజీకి అవార్డు రావడం పట్ల పలు సాహిత్య సంస్థలు, రచయితల సంఘాలు శు భాకాంక్షలు, హర్షం వ్యక్తం చేశాయి.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి : మండల పరిధిలోని పాఠశాలల్లో ఐదు నుండి పది సంవత్సరాల మధ్య వయస్సు వున్న విద్యార్థి, విద్యార్థినుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ కార్యక్రమాన్ని ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ఆధార్ మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ కార్యక్రమం "అన్ని విద్యార్థులందరికీ తప్పనిసరి చేసిన నేపథ్యంలో, మండలంలోని పాఠశాలల్లో జరుగుతున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సది నియోగం చేసుకోవాలి" అని తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పా ల్గొన్నారు.

బాధిత రైతులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి -యాదమరి: పూతలపట్టు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన రైతులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి బుధవారం పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే మురళీమోహన్ బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగుల పంట పొలాలకు రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏనుగుల దాటి నివారించేందుకు అటవీ ప్రాంత సరిహద్దుల్లో ఏనుగులు పొలాలకు రాకుండా సోలార్ బెంచింగ్ మరియు కందకాలు ఏ విధంగా చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు. నియోజక వర్గంలో ని ఐదు మండలాలకు సంబంధించిన రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి మండల అధ్యక్షు డు కార్యదర్శులు పా ల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

క్రైం న్యూస్

చోరీ కేసులో ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని గంగమ్మ గుడి వద్ద ఆగస్టు నెలలో చిట్టి బాబు నాయుడు ఇంట్లో చోరీ కేసులో నిందితుడు తమిళనాడుకు చెందిన సుందర్రాజును బుధవారం ఎస్ఆర్ పురం ఎస్ఐ సిబ్బంది అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఎస్ఐ కథనం మేరకు..ఈ ఏడాది ఆగస్టు 23 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6.30 గంటల మధ్యలో, గంగమ్మ గుడి గ్రామానికి చెందిన చిట్టిబాబు నాయుడు, ఇంటిలో తలుపులు, బీరువాలు పగలకొట్టి, బంగారు నగలు, వెండి వస్తువులు దోచుకుపోయారు. ఈ కేసుకు సంబంధించి సమగ్ర దర్యాప్తు చేపట్టి, దొంగల్లో ఒకరైన జి సుందర్రాజును అరెస్టు చేశారు. అతని వద్ద నుండి రూ.5,000 నగదు, ఒక విస్పా స్కూటీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు జైలుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.


పోలీసులకు పట్టుబడ్డ దొంగ

అమర రాజాలో లెడ్ బుషెస్ అపహరణ

- ఏడుగురు అరెస్ట్- మూడు వాహనాలు సీజ్
- రూ.1.86 లక్షల బంగారు నగలు స్వాధీనం

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి మండల పరిధిలోని అమర రాజా ఫ్యాక్టరీలో ఈ సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుండి అక్టోబర్ 31వ తేదీ వరకు, ప్లాంట్‌లోని లెడ్ బుషెస్ స్టాక్ పాయింట్ నుండి సుమారు 91 టన్నుల లెడ్ బుషెస్, దాదాపు రూ.2.73 కోట్ల విలువైనవి, అక్కడ పని చేసే నలుగురు, కొంతమంది కలిసి అపహరించారని యాదమరి పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు బుధవారం ఏడుగురిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ప్లాంట్ ఫ్యాక్టరీ మేనేజర్ ఈ నెల 4వ తేదీన యాదమరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. చిత్తూరు డీఎస్పీ ఆధ్వర్యంలో, చిత్తూరు రూరల్ వెస్ట్ సర్కిల్ ఎస్ఐ శ్రీధర్ నాయుడు , యాదమరి ఎస్ఐ సిబ్బంది కలిసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం రామభద్రాపురం ప్రాంతంలో దొంగతనానికి సంబంధించిన 27.6 టన్నుల మెటీరియల్ దాని విలువ 82,80,000, మిగిలిన మెటీరియల్ అమ్మగా వచ్చిన రూ 1,86,00,000 నగదు, విలువైన బంగారం, ఇతర విలువైన సెక్యూరిటీలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ దర్యాప్తులో మొత్తం ఏడు గురిని అరెస్టు చేసి, ఒక ఐచర్ వాహనం, అశోక్ లేలాండ్ దోస్త్ వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. సరుకులు బయటకు తీసుకెళ్లేందుకు సహకరించిన ఐచర్ డ్రైవర్ బాబును కూడా అరెస్టు చేశారు.

రెవెన్యూ డివిజనల్ మానిటరింగ్ సభ్యుల నియామకం

ప్రజాశక్తి- రామకుప్పం: కుప్పం నియోజకవర్గ రెవెన్యూ డివిజనల్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా రామకుప్పం మండలానికి చెందిన జయశంకర్, కృష్ణా నాయక్‌లను నియమిస్తూ ఆర్డీవో శ్రీనివాసరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఉన్సిగానిపల్లి గ్రామానికి చెందిన జయశంకర్, పిఎంకె తండాకు చెందిన కృష్ణా నాయక్‌లు మానిటరింగ్ సభ్యులుగా నియామకం కావడం పై పలువురు హర్షం వ్యక్తం చేశారు.


అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు: ఎస్ఐ



ప్రజాశక్తి- రామకుప్పం: మండ లంలో అసాం ఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తీసు కుం టామని ఎస్ఐ వెంకట మోహన్ తెలిపారు. బుధవారం రామకుప్పం లోని షాది మహల్ పరిసరాలతో పాటు పలు చోట్ల అసాంఘిక కార్యకలాపాలు జరుగు తున్నాయని అందిన సమాచారంతో పరిసరాలను పరిశీలించారు. ముఖ్యంగా యువత గంజాయి, మత్తు పదార్థాలతో జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు పలమనేరు పోలీసులు సైబర్ నేరాలు, ఎన్‌డిపిఎస్ చట్టం, రోడ్డు భద్రత, ఈవ్ టీజింగ్, మహిళలపై నేరాలు వంటి అంశాలపై అవగాహన నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మురళీమోహన్, ఎస్ఐ స్వర్ణ తేజ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


జగదీశ్వర్‌రెడ్డి జన్మదినవేడుకలు నిర్వహిస్తున్న అభిమానులు

ఘనంగా జగదీశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండలం వైసిపి రాష్ట్ర మేధావుల వేదిక కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవా రం రాత్రి ఆ పార్టీ కార్య కర్తలు ఘనంగా నిర్వహించారు. భారీ ఎత్తున బాణ సంచాలు పేల్చి 'జగదీశ్వర్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భారీ ఎత్తున కేక్ కోసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో కార్యకర్తలే ఈ జన్మదినం వేడుకలను అట్టహాసంగా నిర్వహించు కున్నారు.

నేడు ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం

ప్రజాశక్తి-గుడిపల్లి: ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు ఆర్‌డివో కార్యాలయంలో నిర్వ హిస్తు న్నట్లు ఆర్‌డివో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఎస్‌సి, ఎస్‌టి నాయకులు, హాజరుకావాలని, అన్ని శాఖల అధికారులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్తు..

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ప్రకృతి వ్యవసాయంతోనే దేశం భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని దేశ ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చిత్తూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం శిక్షణ అధికారి నాంచారమ్మ అన్నారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణలో భాగంగా 70 మంది నూతన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు ఐదు రోజుల శిక్షణను బుధవారం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పలువురు సాగుచేస్తున్న నమూనాలను పరిశీలించారు. సుధాకర్ నాయుడు నిర్వహిస్తున్న ఎన్పీఎం సెంటరును సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ గురుప్రసాద్, రెడ్డి కుమారి ,లక్ష్మి, హనుమంతు, రాజమ్మ, రమేష్ సుధాకర్ నాయుడు, హరికృష్ణారెడ్డి , రమణ పాల్గొన్నారు.

దేశ ప్రగతికి మూలం కోడెదూడలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: దేశ ప్రగతికి మూలం పశుసంతతి కోడెదూడలు అని చిత్తూరు సంయుక్త సంచారకులు పశుసంవర్ధక శాఖ డాక్టర్ ఉమామహేశ్వరి అన్నారు. బుధవారం జిడి నెల్లూరు మండల పరిధిలోని వెజ్జుపల్లిలో పశు సంతతి సంకరజాతి పేయ దూడల ప్రదర్శన స్థానిక సర్పంచ్ హరి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పథకం ఉద్దేశం పై డిడిపిటిపి డాక్టర్ వాసు రైతులకు వివరించారు. ఈ పి టి పి సేవలు ఏనలేనివి ఇవి పాడి రైతుల అభివృద్ధికి ఎంతగానో మేలు చేకూరుస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈరోజు వెజ్జుపల్లి గ్రామంలో 42 దూడలకి డి వార్మింగ్, మినరల్ మిక్సర్లు ఇతర మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంకర జాతీ పెయ్య దూడల ప్రదర్శనలో భాగంగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ గోవిందయ్య, డిడి పుత్తూరు, జీడీ నెల్లూరు ఏడి డాక్టర్ మురళీమోహన్, పశుసంవర్ధక శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరిత గతిన పరిష్కరించండి: ఆర్‌డివో


రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌డివో అనుపమ

ప్రజాశక్తి -కార్వేటినగరం : ప్రతి సోమవారం వచ్చే అర్జీలను త్వరిత గతిన పరిష్కరించాలని నగరి ఆర్డీవో అనుపమ అన్నారు. బుధవారం కార్వేటి నగరం మండలం తహశీల్దారు కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మ్యుటేషన్, మీసేవ, సచివాలయం నుండి వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. పొలాలకు, శ్మశానవాటికలకు దారి సమస్య వుంటే సర్వే చేసి దారి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు, రైతులకు సంబంధించి దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా వీఆర్వోలు పని చేయాలని పేర్కొన్నారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు నాగరాజు, డిటి స్వరూప రాణి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, హెచ్‌డిటి లోకేష్, సర్వేయర్ మార్కొండయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని పరిరక్షించాలి: ఎంపీడీవో

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలం కంచబందర్లపల్లి గ్రామ పంచాయతీలో కడ ఆధ్వర్యంలో 'మరుగుదొడ్డిని ఉప యోగిద్దాం.. పారిశుధ్యాన్ని పాటిద్దాం..' అనే అంశంపై గుడిపల్లి మండల ఎంపీడీవో రాధాకృష్ణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు.

జీవామృతంతోనే పంటల వ్యాధులు నయం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: జీవామృతంతోనే పంటల వ్యాధులు నయమవుతాయని రైతు సాధికార సంస్థ డిపిఎమ్ వాసు అన్నారు. బుధవారం మండలంలోని జిల్లేడుపల్లి కల్లూరుపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని సాగుచేసి నేచురోపతికి అలవాటు పడాలని అందుకు గ్రామంలో దొరికే వాటితోనే ఇన్పుట్స్ తయారీలో బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, సీడ్ పెల్లిటైజేషన్,నీమాస్త్రం కోడిగుడ్డు నిమ్మరసం ద్రావణం, తయారు చేసుకుని పొలంలో పిచికారీ చేసుకుంటే పంట లకు వచ్చిన వ్యాధులు నయమవుతాయని వాటి ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. చంద్రకళ కూరగాయలు, ఉద్యనవన గ్రేడ్ మోడల్ లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిఎంయు నరేంద్ర, ఎన్ఎఫ్ఏ ఫైజున్నిసా, డిటిటిలు విజయ, లక్ష్మీరెడ్డి, రాజా ప్రతాప్, నిలకంఠరెడ్డి, అంబికా గాంధీ పాల్గొన్నారు.

జనసేన జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గం గుడిపాలలో జనసేన జెండా ఆవిష్కరణను ఆ పార్టీ సీనియర్ నేత పగడాల శశికాంత్ ఆధ్వర్యంలో పండుగ వాతావరణంలో బుధవారం నిర్వహించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాల జనసేన అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ప్రభుత్వ విప్, కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్య అతిథులుగా విచ్చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి జనసేన జెండాను ఆవిష్కరించారు.

లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కుప్పం: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కుప్పం మున్సిపాలిటీ కదిరి బండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించగా టిడిపి శ్రేణులతో కలిసి ఎమ్మెల్సీ శ్రీకాంత్ శ్రీ లక్ష్మీనరసింహస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామి వారిని దర్శించు కున్నారు. ఆలయ అభివృద్ధికి కృషిస్తామన్నారు.

పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని పిబివాడ పంచాయతీలోని జెకె పల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, పాడి రైతుల అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాడి ఆవులకు పశు గర్భకోశ వ్యాధుల చికిత్సచేసి తగిన మందులు మినరల్ మిక్చర్, అందించారు. ఆవులకు పిడుదుల మందు పిచికారీ, నట్టల నివారణ మందులు అందించారు. ముఖ్య అతిథి కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు మాట్లాడుతూ పాడిరైతుల కోసం 1400 రూపాయలు విలువ చేసే పెయదూడల కృత్రిమ గర్భధారణ వీర్యంను ఉచితంగా అందిస్తున్నారని దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక డెయిరీలలో పాల సామర్థ్యాన్ని పెంపునకు చర్యలు చేపట్టారని పాడి రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టరు ఎస్‌రెడ్డి కుమారి, చంద్రశేఖర్, పశువైదులు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, పాడి రైతులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు


ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: తీర్థం పీహెచ్‌సీ పరిధిలోని దేవదొడ్డిలో గర్భిణులకు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు అందించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం కాంతమ్మ మాట్లాడుతూ 'గర్భధారణ సమయంలో కాన్పు సమయంలో ప్రమాదాలు జరగకుండా రెండు టిడి ఇంజెక్షన్లు వేయించుకోవాలని, బిడ్డ పుట్టిన వెంటనే, 45 రోజుల తర్వాత నెలనెలా వ్యాక్సిన్ వేయించడం వల్ల వివిధ ప్రాణాంతక వ్యాధులు రాకుండా కాపాడవచ్చని వివరించారు. గర్భిణులు నెలనెలా ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని, పుష్కల మైన పోషకాహారం తీసుకోవాలని, తప్పనిసరిగా హాస్పిటల్ లోనే కాన్పు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో సిహెచ్ఓ బిబి, ఏఎన్ఎమ్ వాణి, అంగన్‌వాడీ వర్కర్ నాగవేణి, ఆశా వర్కర్లు చరిత, జమున పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు డిఎంపురం విద్యార్థి




ప్రజాశక్తి- కార్వేటినగరం: రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని జీడీ నెల్లూరు నియోజకవర్గ స్థాయి పోట ల్లో పాల్గొన్న డీఎం పురం విద్యార్థి గోవర్ధన్ రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బొజ్జా రాము అధ్యక్షతన బుధవారం పాఠశాల ఆవరణలో ప్రత్యేక ఏర్పాటు చేశారు. వక్తృత్వ , క్విజ్ పోటీల్లో సత్తా చాటి నియోజక వర్గ స్థాయిలో ద్వితీయ స్థానం పొందినందుకు గోవర్ధన్‌ను పాఠశాల ఉపాధ్యాయులు రవి, మాలతి, కిషోర్ కుమార్ , రంజిత్ కుమార్, బొజ్జా రాము, గ్రామస్థులు చంద్రశేఖర్, నిర్మల, అమ్ములు, గిరిజ, కాంతమ్మ, తోటి విద్యార్థులు అభినందించారు.

తుపానులో ప్రజలకు అండ: మాజీ ఎమ్మెల్సీ



ప్రజాశక్తి- రామకుప్పం: రాష్ట్రంలో ఇటీవల కురిసిన తుపానుకు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచిందని మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ తుపాను బాధితులకు నగదు, ఆహార భద్రత ఏర్పాటు, సురక్షితమైన భవనాలకు ప్రజలు తరలించి అన్ని విధాల ప్రభుత్వం భరోసా ఇచ్చిం దన్నారు. వరి, వేరుశనగ, పత్తి, చెరుకు వంటి పంటలకు సీఎం చంద్రబాబు 25 వేల రూపా యలను నష్టపరిహారం అందించారన్నారు. 9 తుపానులకు 20 కోట్లు నష్టపరిహారం అందించిందని ఆయన పే ర్కొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి: ఎమ్మెల్సీ


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- రామకుప్పం: రాను న్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కార్య కర్తలు సంసిద్ధం కావాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బుధవారం పేర్కొన్నారు. రామ కు ప్పం లో టిడిపి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిం చారు. మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ గెలుపుకు కృషి చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకి కానుక ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా ప్రజా ప్రతినిధులు, నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. కుప్పం హంద్రీ-నీవా జలాలతో ప్రతి చెరువుకు నీటి కొరత లేకుండా చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, సీతాపతి, రామ్మూర్తి, చలపతి, రామకృష్ణప్ప, నాగభూషణం, రవి రెడ్డి, రఘు, సుబ్రీ, బాలు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పిపిపి విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు జరుగుతున్న బస్సు యాత్ర 15వ రోజు చేరుకున్న సందర్భంగా చిత్తూరు కలెక్టరేట్‌లో రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కే .శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్ , తదితరాలు పాల్గొన్నారు.

శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయం..

ఆదాయం మెండు.. ఆదరణ కరువు

- తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని దేవాదయ శాఖ
- స్థానిక భక్తుల ఆవేదన

ప్రజాశక్తి-గుడుపల్లి: గుడిపల్లి మండలం చిన్న గొల్లపల్లి గ్రామ పంచాయతీలో నెలకొన్న శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయం ఆంధ్ర, తమిళనాడు రాష్ట్ర కూడలిలో వున్న ఈ ఆలయానికి ఆదాయం అధికంగా వస్తుంది. ప్రతి ఏటా ఆడికృత్తిక నెలలో సుమారు 35 లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుం దని, అలాంటి ఆలయానికి తాగు నీరు బోరు, బావి, స్టాటరు సుమారు 20 రోజుల క్రితం చెడి పోయింది. ఇప్పటి వరకు మరమ్మతులకు నోచుకోకపోవడం దారుణమని దేవాదాయ శాఖ, పంచాయ తీ స్థానిక నాయకులు జాతర నిర్వహించే సమయంలో హడావిడి చేసే వారు. ఇప్పుడు ఎందుకు ఈ బోరును రిపేరు చేయలేదని అక్కడికి వచ్చే భక్తులు, స్థానిక పంచాయతీ ప్రజలు ఆవేదన వ్యక్తం


మరమ్మతుకు గురైన స్టాటరు

చేస్తున్నారు. ఎనిమిది, తొమ్మిది వేల రూపాయలు ఖర్చు పెడితే తొలగి పోయే సమస్యను ఇప్ప టి వరకు చేయకపోవడం ఏమిటి? అని ఆ గ్రామపంచాయతీ ప్రజ లు నిల దీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధి త అధికారులు వెంటనే చర్యలు తీసుకొని అక్కడికి వచ్చే భక్తులకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక భక్తులు కోరుతున్నారు.

20 లోపు రైతులకు నగదు జమచేయాలి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: ఈనెల 20వ తేదీ లోపు జిల్లాలోని మామిడి రైతులకు గుజ్జు ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్ణయించిన ధరను జమ చేయాలని లేకుంటే రైతులు ఉద్యమాలు చేపడతామని మామిడి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు హరిబాబు చౌదరి హెచ్చరించారు. ఆ సంఘం నాయకులు, రైతులు భారీ స్కూటర్ ర్యాలీతో వచ్చి జీడి నెల్లూరు జైన్ ఫామ్ ఫ్రెష్ మామిడి గుజ్జు ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఈ ఏడాది ఫ్యాక్టరీకి మామిడి కాయలు అందించిన రైతులకు ఈనెల 20వ తేదీ లోపు నగదు జమ చేయకుంటే రైతులకు గుజ్జును అందించాలని కోరారు. దీనిపై స్పందించిన జైన్ సంస్థ మేనేజర్ దిలీప్ తమ సంస్థ ఉన్నత అధికారులతో చర్చించి వీలైనంత త్వరలో ప్రభుత్వం నిర్ణయించిన ఎనిమిది రూపాయల ధరను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మామిడి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఆనంద నాయుడు, సుకుమార్ నాయుడు, గోవింద స్వామినాయుడు, హరిబాబు నాయుడు, ప్రభాకర్ రెడ్డి, గుణశేఖర్ రెడ్డిలతో రైతులు పాల్గొన్నారు.

పిఎంయువై గ్యాస్ కనెక్షన్లు మంజూరు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) దీపం -2 పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందిస్తామని తహశీల్దారు ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాల నుంచి మహిళ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్‌తో పాటు రెండు ఫొటోలు, బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ ఆఫీస్‌లో రూ రెండువేలతో భద్రత డిపాజిట్‌తో పాటు అప్లికేషన్ సమర్పిస్తే అర్హత ఆధారంగా గ్యాస్ కనెక్షన్ మంజూరు చేస్తామని తెలిపారు. బైరెడ్డిపల్లి మండలంలో గ్రామాలు, మండల కేంద్రంలో హోటల్ యాజమానులకు –, టీ

- హోటల్లో కమర్షియల్ సిలిండర్ లేకుంటే కఠిన చర్య
- తహశీల్దారు హెచ్చరిక



దుకాణం, ఇతర వ్యాపారం చేసుకునే వారు వాణిజ్య గ్యాస్ సిలిండర్ (కమర్షియల్ సిలిండెర్)కు బదులు గృహ అవసర సిలిండర్ ఉపయోగిస్తున్నారని ఇలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలా పట్టుబడితే ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు 20 వేల నుంచి 50 వేల రూపాయలు వరకు జరిమానా విధిస్తామని తహశీల్దారు హెచ్చరించారు.

క్రీడల పోటీల్లో నింద్ర విద్యార్థికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి - విజయపురం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లి లో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నింద్రలో 8వ తరగతి చదువుతున్న వసంత్ హైజంప్ లో మొదటి స్థానం సాధించాడు. ఈ నెల 7వ తేదీ శ్రీకాకుళంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపిక అయ్యాడు. హెచ్ఎం శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయుడు జ్ఞానకుమార్ ఆ విద్యార్థిని అభినందించారు.

లావణ్య కుటుంబీకులకు న్యాయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలం నాగిరెడ్డి పల్లి పంచాయతీ చల్లావారి పల్లికి చెందిన ఇంటర్ విద్యార్థిని లావణ్య కుటుంబీకులను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం పరామర్శించారు. మూడు రోజుల క్రితం లావణ్య ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. పెద్దపంజాణి మండలం మారపల్లికి చెందిన హేమరాజ్ అనే యువకుని వేధింపులతోనే తమ కుమార్తె మృతి చెందిందని వారి కుటుంబీకులు ధర్నా చేయడంతో ఈ విషయం పెను దుమారం రేపింది. దీంకి తోడు పోలీసులు కావాలనే కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బుధవారం మండల టిడిపి నాయకులతో కలిసి లావణ్య స్వగ్రామానికి చేరు కున్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబీకులను ఆయన పరామర్శించి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. ఆ విద్యార్థిని మృతి అంశంలో నిష్పక్షపాతంగా విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు



తీసుకుంటామని తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా త్వరగా పూర్తిస్థాయిలో విచారణ జరిపి భాద్యులపై చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, పెద్దపంజాణి మండల నాయకులు మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీరాములు, రోజా రెడ్డి , చలపతి,నాగిరెడ్డి, రుద్ర మూర్తి, శంకర్, హరి, నోము రాజు, చంద్ర,తో పాటు పంచాయతీ నాయకులు మణి, మోహన, భూపతి పాల్గొన్నారు.

టిడిపిలోకి భారీ వలసలు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం టిడిపిలోకి భారీగా వలసలు మొదలయ్యాయి. వైసీపీ నేతలు తమ కుటుంబాలతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. బుధవారం కుప్పం మండలం ఉర్ల ఓబనపల్లి, చెక్కు నత్తం పంచాయతీలకు చెందిన 154 మంది వైసీపీ శ్రేణులు టిడిపిలో చేరారు. టిడిపి కుప్పం మండల అధ్యక్షుడు రాజగోపాల్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో 154 మంది వైసీపీ శ్రేణులు టిడిపిలో చేరగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతరం, రెస్కో చైర్మన్ ప్రతాప్, పార్టీ కండువాతో స్వాగతం పలికారు.

జాతీయ ఆటల పోటీలకు శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎస్‌జిఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీ ముగిసిన అంతర్ జిల్లాల వాలీబాల్ క్రీడా పోటీల్లో చిత్తూరు జిల్లా తరపున గంగవరం మండలం సాయి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ముగ్గురు (అబ్దుల్ రెహమాన్, హితేష్, మొహమ్మద్ సైఫ్) ప్రాతినిథ్యం వహించారు. అందులో సాయి శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థి అబ్దుర్ రహమాన్ ఖాన్ పలమ నేరులో ముగిసిన, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల అండర్-19 విభాగంలో వాలీబాల్ పోటీలలో చిత్తూరు జిల్లా తరపున ప్రాతినిథ్యం వహించాడు. ఆ పోటీలలో అతను చూపిన ప్రతిభ ఆధారంగా ఏపీ రాష్ట్ర జట్టుకి ఎంపికై రాబోయే 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లో ఈ నెల 12 నుండి 17వ తేదీ మధ్య నిర్వహించనున్న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో ప్రాతినిధ్యం వహించ నున్నా డు. ఇదే విద్యార్థి గతంలో మొదటి సంవత్సరం చదువు తున్న ప్పుడు 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ పోటీలలోనూ అండర్ 17 గ్రూప్‌లో జాతీయ పోటీలలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని, సహకరిస్తున్న అతని తండ్రి మంచి క్రీడాకారుడు అయిన దావూద్ ఖాన్‌ని కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినం దించింది. కళాశాల డైరెక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల తరపున మంచి క్రమశిక్షణ, విద్యతోపాటు క్రీడలకు కూడా ముఖ్య ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఎంవిఆర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.


అబ్దుల్ రెహ్మాన్ ఖాన్